క్లుప్తంగా

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

చేవెళ్ల: నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి న్యాయంగా ఉద్యమిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేస్తోందని బీజేవైఎం నాయకులు ఆరోపించారు. బీజేవైఎం నిరసనల నేపథ్యంలో మండల కేంద్రంలో పోలీసులు శుక్రవారం ఆ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగులకు అన్యాయం చేస్తూంటే బీజేవైఎం చూస్తూ ఊరుకోదన్నారు. తప్పకుండా ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. డీఎస్సీపై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవటం లేదన్నారు. అరెస్టు అయిన వారిలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మధుకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అభిలాష్‌రెడ్డి, జయసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

రహదారిపై గుంతను పూడ్చిన స్థానికుడు


గుంతలో డస్ట్‌ను పోయిస్తున్న దాత సత్తి, పక్కన ట్రాఫిక్ పోలీసులు

చేవెళ్ల: రోడ్డు ఏర్పడిన గుంతను ట్రాఫిక్ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానికులు పూడ్చివేశారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్ ముందున్న గుంతలో వర్షపు నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలిగిస్తోంది. దీంతో స్థానిక నాయకుడు దండు సత్తి ముందుకు వచ్చి ట్రాఫిక్ పోలీసుల సహకారంతో శుక్రవారం గుంతను పూడ్చివేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, సిబ్బంది శంకరయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

షాద్‌నగర్: ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న సూచించారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, చైర్మన్ కొందూటి నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ.. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులను నివారించవచ్చన్నారు. అనంతరం వార్డులో రోడ్ల వెంట ఉన్న చెత్తా చెదారాన్ని, ముళ్ల చెట్లను తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నందీశ్వర్, మున్సిపల్ సిబ్బంది సాయిబాబా, రమేష్, జవాన్ మల్లేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అరుణాచలానికి బస్సు సర్వీసు ప్రారంభం


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరపల్లి

షాద్‌నగర్: తమిళనాడులోని అరుణాచల క్షేత్రంలో గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు షాద్‌నగర్ నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఈ బస్సును శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఆర్టీసీ అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును షాద్‌నగర్ డిపో నుంచి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

- గ్రామీణ రహదారుల్లో సూచిక బోర్డులు కరువు
- రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


ఎన్కేపల్లి శివారులో సూచిక బోర్డు లేని మలుపు


బాకారం సమీపంలో ప్రమాదకరంగా రోడ్డు

మొయినాబాద్ రూరల్: గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా మూలమలుపుల వద్ద చెట్లు పెరగడంతో ముందు వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మండల పరిధిలోని ఎన్కేపల్లి, బాకారం తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, అమ్డాపూర్, కాశింబౌలి, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, హిమాయత్‌నగర్, చిల్కూర్, పెద్దమంగళారం, ఎల్కాగూడ తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మూలమలుపులు అధికంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బాకారం–ఎన్కేపల్లి, అజీజ్‌నగర్–నాగిరెడ్డిగూడ గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వాహనాదారులు, బైక్‌లు, ఆటోలు అధికంగా రాకపోకలు సాగిస్తారు. మలుపుల వద్ద ముళ్ల పొదలు ఉండడమే కాకుండా సూచికబోర్డులు సైతం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క రోడ్లు గుంతలు పడి అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులకు దాదాపు 10 నుంచి 15 మూలమలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలిగించి, మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదాలను అరికట్టాలి



మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. కొన్ని రహదారులకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి.

– మహేందర్‌ముదిరాజ్, బాకారం, మొయినాబాద్

ముళ్లపొదలు తొలగించాలి



అజీజ్‌నగర్ నుంచి నాగిరెడ్డిగూడ–బాకారం వెళ్లే రహదారిలో అధిక మూలమలుపులున్నాయి. పలు చోట్ల ముళ్లపొదలు రోడ్లపైకి వచ్చాయి. దీంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చెట్లను తొలిగించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– తిరుపతిరెడ్డి, బాకారం, మొయినాబాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్‌లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించగా.. కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం నీటి ట్యాంకు వద్ద నిలిచిన నీరు, చెత్తా, చెదారాన్ని తొలగింపజేసి కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో డెంగీ, మలేరియా ప్రబలే అవకాశం అధికంగా ఉండడంతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాములు, మేనేజర్ అంజన్‌కుమార్, సిబ్బంది అనూష, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి


షాద్‌నగర్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు


షాబాద్: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

షాద్‌నగర్: విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన సేవలు మరువలేనివని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పని చేసిన అరుంధతి పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. శుక్రవారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. బదిలీపై వెళుతున్న వారిని, నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుజ్జి, రాజునాయక్, మాజీ వైస్ ఎంపీపీ మౌనిక, హరికృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ తావుసింగ్, రమేష్, రాజు, వినోద్, నరేందర్, పంచాయితీ కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో గురువుల పాత్ర కీలకం

షాబాద్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తాళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన సులోచన, ప్రభాకర్, రమేష్, జ్యోతి, రేణుక, సత్యనారాయణ, నర్సింహులు లను టీచర్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ సునీత తదితరులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. బదిలీపై ఇక్కడికి వచ్చిన ఉపాధ్యాయులు మంజుల, లలిత, సీతాబాయి, మొగులయ్య, బాలకృష్ణ, భిక్షపతిలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగమేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, కిరణ్మయి, బిక్షపతి, బాలకృష్ణ, మొగులయ్య, గ్లోరీ, శోభారాణి, తదితరులున్నారు.

జ్ఞాపకాలను పదిలంగా దాచుకుంటూ..



ఎంఆర్‌సీహెచ్ పాఠశాల పూర్వ విద్యార్థులు

మొయినాబాద్: ఇరవై ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివినవారంతా మళ్లీ ఒక్కచోట చేరారు. పాఠశాల రోజులను, నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మొయినాబాద్‌లోని ఎంఆర్‌సీహెచ్ పాఠశాలలో 2004–05 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం సురంగల్‌లోని ఓ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, విక్రంరెడ్డి, మధుసూదన్‌గౌడ్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అదనపు బస్సులు కేటాయించండి

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యా సంస్థల సమయానికి బస్సులను నడపాలని కోరుతూ శుక్రవారం విద్యార్థులు బస్టాండ్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కేశంపేట మండలంలోని లేమామిడి, వేముల్‌నర్వ, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ, కేశంపేట గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సులు సమయానికి రావడంలేదని ఆరోపించారు. దీంతో కళాశాలకు వెళ్లేందుకు ఆలస్యం అవుతుందని అన్నారు. విద్యా సంస్థల సమయానికి అదనపు బస్సులను నడిపాలని కోరారు.


బస్టాండ్ ఆవరణలో విద్యార్థుల బైఠాయింపు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ సంధ్య తదితరులు

మొయినాబాద్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మొయినాబాద్ ఎంపీడీఓ సంధ్య అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటి చెట్లను పెంచితేనే పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

కేశంపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన కొనసాగుతుంది. తమకు రావాల్సిన బిల్లులతో రాష్ట్ర ప్రభుత్వం తమకు నెలకు పదివేల వేతనం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని వారు శుక్రవారం డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు సీఐటీయూ సంఘీభావం తెలిపింది. కార్యక్రమంలో కార్మికులు సత్యమ్మ, యాదమ్మ, సబిత, జంగమ్మ, నిర్మల, బాలమణి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ పోటీలకు గురుకుల విద్యార్థులు

షాద్‌నగర్: ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన నాగర్‌కర్నూల్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శైలజ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ చెన్నయ్య మాట్లాడుతూ.. ఈ నెల 21న హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. వీటికి విజయలక్ష్మి, శశిరేఖ, మమత స్పైరింగ్ విభాగంలో అంకిత ఐశ్వర్య, గీత, ఈరమ్మ ఎంపికయ్యారని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు


క్యాంపు కార్యాలయం వద్ద సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఆపదలో ఉన్న పేదలకు వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 55 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందన్నారు. అత్యవసర సమయంలో వైద్య ఖర్చులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వసంతం, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పెంటయ్యగౌడ్, జనార్ధన్, ప్రవీణ్‌కుమార్, నరేందర్, మల్లేశ్, సురేందర్, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు అల్లి దేవేందర్, అన్నపూర్ణ, విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలకు వేతనం రూ.18వేలు నిర్ణయించాలని పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు పరిష్కరిస్తామన్న హామీని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు ధనలక్ష్మి, సుగుణ, హేమలత, గీత, లావణ్య, బాలమణి, పద్మ, నిర్మల, పావని తదితరులు పాల్గొన్నారు.

మనోప్రగతి క్యాంపును వినియోగించుకోవాలి

కేశంపేట: మానసిక దివ్యాంగుల కోసం ప్రభుత్వం మనోప్రగతి క్యాంపును నిర్వహిస్తుందని, దీన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం భగవంతు కోరారు. మండల కేంద్రంలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలో శుక్రవారం మనోప్రగతి క్యాంపును నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఎం భగవంతు మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగుల కోసం నిపుణులు వచ్చి సూచనలు, సలహాలను అందిస్తారని అన్నారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్

షాద్‌నగర్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ షాద్‌నగర్ తాలుక అధ్యక్షుడు విజయ్‌చారి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయ్‌చారి మాట్లాడుతూ.. ఎంతో మంది నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు హాస్టల్‌ల్లో ఉండి విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. వారికి కనీస సదుపాయలు కల్పించకపోవడం దారుణమన్నారు. హాస్టల్‌లో కిటికీలు సరిగా లేవని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, అమీర్, సిద్ధు, శ్రీమాన్, కార్తీక్, శశి, రాకేష్, భాను తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులతో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

రుణమాఫీతో రైతుల కళ్లలో ఆనందం

- కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్
- నాయకులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చేవెళ్ల: రైతుల కళ్లలో ఆనందాన్ని నింపిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను రాజులను చేయాలనే లక్ష్యం కాంగ్రెస్ పార్టీదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందే అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పి.వెంకటస్వామి, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, ఆగిరెడ్డి, బుచ్చిరెడ్డి, మధుసుధన్‌గుప్తా తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

షాబాద్: రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. హైతాబాద్‌లో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం, రేగడిదోస్వాడలో శేఖర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రావ్, నాయకులు చెన్నయ్య, పెంటారెడ్డి, మంగలి చెన్నయ్య తదితరులున్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.లక్ష లోపు రుణాలున్న రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా శంకర్‌పల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఇన్‌చార్జి పామెన భీం భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

హాజీపల్లిలో సంబరాలు

షాద్‌నగర్: అన్నదాతలకు ప్రభుత్వం రుణాలు మాఫీ చేసినందుకు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజీపల్లి, పీర్లగూడ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు రైతులతో కలిసి ముఖ్య కూడళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. నాయకులు విష్ణు, దర్శన్, పైల్వాన్‌గోరి, గోరి, తాహేర్, ఆదిల్, అన్ను, జగన్ పాల్గొన్నారు.

మొదళ్లగూడ కూడలిలో..

కొత్తూరు: ఇచ్చిన మాట మేరకు రైతులకు రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇతర పార్టీల నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని నందిగామ మండలంలోని మొదళ్లగూడకు చెందిన కాంగ్రెస్ నాయకులు, రైతులు కోరారు. రుణమాఫీ చేయడంతో గ్రామంలోని ప్రధాన కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, శేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నర్సింలు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలికట్టలో సంబరాలు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీటీసీల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కావలిశ్రీశైలం అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బెండిమోహన్‌రెడ్డి, రాజు, మధుకర్‌గౌడ్, యాదయ్యయాదవ్, చంద్రయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.


షాబాద్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న భీంభరత్, నాయకులు


చేవెళ్ల: సంబరాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


షాద్‌నగర్‌రూరల్: రైతులకు స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ నేతలు


షాద్‌నగర్: హాజీపల్లిలో పార్టీ శ్రేణుల సంబరాలు